సాక్షి
అనంతపురం

శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



చీనీ టన్ను రూ.34 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.34 వేలు పలికాయి.



టమాట కిలో రూ.16

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.16, కనిష్టం రూ.4, సరాసరి రూ.10 పలికింది.

గరిష్టం/కనిష్టం

36.9°/14.4°

జిల్లా అంతటా శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేకువజామున కొన్ని ప్రాంతాల్లో చలి వాతావరణం కొనసాగింది.

న్యూస్‌రీల్

అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించిన డైరెక్టర్



రుద్రంపేటలో కోడిగుడ్ల నిల్వ గోడౌన్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్ సిరి

అనంతపురం సెంట్రల్: మహిళా శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ అట్టాడ సిరి శుక్రవారం జిల్లాలో పర్యటించారు. తాడిపత్రిలో పలు అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు అనంతపురంలోని రుద్రంపేటలోని అంగన్‌వాడీ కేంద్రాలను, కోడిగుడ్ల నిల్వ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం బుడ్డప్పనగర్‌లోని శిశుగృహ, బాలసదనం, జేఎన్‌టీయూ రోడ్డులోని సర్వీస్‌హోంలను పరిశీలించి, వివరాలు ఆరా తీశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

పలు ప్యాసింజర్ రైళ్లకు అదనపు కోచ్‌లు



గుంతకల్లు: తిరుపతికి వెళ్లే పలు ప్యాసింజర్ రైళ్లకు అదనపు కోచ్‌లు ఏర్పాటు చేసినట్లు సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్.రాకేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కదిరిదేవరపల్లి – తిరుపతి – కదిరి దేవరపల్లి (రైలు నం.07589/90) ఈ ప్యాసింజర్ రైళ్లకు 01 జనరల్ సెకండ్‌క్లాస్ కోచ్‌ను శనివారం నుంచి జత చేస్తున్నట్లు వెల్లడించారు. గుంతకల్లు – తిరుపతి – గుంతకల్లు (07655/56) ఈ రైళ్లకు ఈ నెల 13 నుంచి రెండు జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లను అదనంగా జత చేస్తామని తెలిపారు. ఇక గుంతకల్లు – చిక్‌జాజూర్ – గుంతకల్లు (07586/85) ప్యాసింజర్ రైళ్లకు ఈ నెల 15 నుంచి అదనంగా రెండు సెకండ్ క్లాస్ కోచ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

మెరుగైన వైద్యం.. ప్రభుత్వ లక్ష్యం



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వీరబ్బాయి దొర

రాప్తాడు: పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని డీఎంహెచ్‌ఓ వీరబ్బాయి దొర అన్నారు. శుక్రవారం ఆయన ప్రసన్నాయపల్లి సచివాలయాన్ని తనిఖీ చేశారు. అక్కడే పనిచేస్తున్న వైద్య సిబ్బందితో మాట్లాడి, వైద్య సేవలపై ఆరా తీశారు. ఆరోగ్య ఉపకేంద్రం లేకపోవడంతో సచివాలయంలోనే వైద్య సేవలందిస్తున్నామని సిబ్బంది తెలిపారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వైద్య సేవలు అందించాలన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో 104 నోడల్ ఆఫీసర్ సుజిత, డీఎం కృష్ణమూర్తి, డాక్టర్ శివశంకర్, రాప్తాడు పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణి, ఏఎన్‌ఎం సునీత పాల్గొన్నారు.

గ్రంథాలయాలకు రూ.31.66 కోట్లతో బడ్జెట్

అనంతపురం: జిల్లాలోని గ్రంథాలయాల నిర్వహణ, ఉద్యోగుల జీతభత్యాలు, పింఛన్ల కోసం 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.31,66,45,094తో బడ్జెట్ ప్రతిపాదించినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన శుక్రవారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థకు అనుబంధంగా జిల్లా కేంద్ర గ్రంథాలయం, గ్రేడ్–1 శాఖా గ్రంథాలయాలు –3, గ్రేడ్–2 శాఖా గ్రంథాలయాలు – 8, గ్రేడ్–3 శాఖా గ్రంథాలయాలు –58, గ్రామీణ గ్రంథాలయాలు తొమ్మిది ఉన్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ కేటాయించడానికి సభ్యుల ఆమోదంతో బడ్జెట్‌ను పౌర గ్రంథాలయ శాఖ డైరెక్టర్‌కు పంపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ తదితరులు పాల్గొన్నారు.

రెన్యూవల్‌కు గ్రీన్ సిగ్నల్





- వచ్చే ఏడాది 150 ఎంబీబీఎస్ సీట్లలో అడ్మిషన్‌కు ఎన్‌ఎంసీ అనుమతి
- కొత్తగా మంజూరైన సీట్లపై ఐదేళ్ల పాటు వరుసగా ఎన్‌ఎంసీ తనిఖీలు
- ఈసారి అనుమతిస్తూ అనంతపురం వైద్య కళాశాలకు లేఖ రాసిన ఎన్‌ఎంసీ
- త్వరలోనే మరో 65 పీజీ వైద్యసీట్లు మంజూరు

కొత్తగా వచ్చే పీజీ వైద్య సీట్లు ఇలా

విభాగం	సీట్లు
అనాటమీ	3
రేడియో డయాగ్నసిస్	12
పల్మనరీ మెడిసిన్	5
మైక్రోబయాలజీ	7
ఫార్మకాలజీ	5
ఫారెన్సిక్ మెడిసిన్	7
జనరల్ మెడిసిన్	8
గైనకాలజీ	9
ఆర్థోపెడిక్స్	9

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలకు కొత్తగా మంజూరైన ఎంబీబీఎస్ సీట్ల రెన్యూవల్‌కు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఈ మేరకు ఎన్‌ఎంసీ (నేషనల్ మెడికల్ కమిషన్) నుంచి ప్రిన్సిపాల్‌కు లేఖ అందింది. 2019 వరకు వైద్యకాలేజీలో 100 ఎంబీబీఎస్ సీట్లు ఉండేవి. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టాక అంటే 2019లో మరో 50 సీట్లు వచ్చాయి. ఇలా కొత్తగా మంజూరైన సీట్లను కాపాడుకోవాలంటే ఎన్‌ఎంసీ (మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో ఏర్పాటు చేసిన) ప్రతి ఏటా వసతులు, అధ్యాపకులు వంటి వాటిపై ఐదేళ్ల పాటు తనిఖీలు నిర్వహిస్తుంది. ఈ ఐదేళ్లలో అన్ని వసతులూ ఉంటేనే ఎన్‌ఎంసీ అనుమతిస్తుంది. లేదంటే రద్దు చేస్తుంది. పదిరోజుల క్రితం ఎన్‌ఎంసీ బృందం తనిఖీలకు వచ్చింది. ఇక్కడి వసతుల కల్పనలో సంతృప్తి చెంది 2023–24 సంవత్సరానికి 150 ఎంబీబీఎస్ సీట్లకు అడ్మిషన్లు నిర్వహించుకోవచ్చని ఈ నెల 9న కళాశాలకు ఎన్‌ఎంసీ లేఖ రాసింది.

భారీగా నియామకాలు చేపట్టడం వల్లే..

కనీ వినీ ఎరుగని రీతిలో అనంతపురం వైద్య కళాశాలకు అధ్యాపకులను నియమించడం వల్లే ఎంబీబీఎస్ సీట్లకు ఢోకా లేకుండాపోయింది. ప్రస్తుతం 108 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండగా.. అందులో ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 56 మందిని శాశ్వత ప్రాతిపదికన నియమించారు. దీంతో పాటు మరో 50 మందిని వివిధ కేటగిరీల్లో పారామెడికల్ ఉద్యోగులను నియమించారు. నాడు – నేడు పనుల్లో భాగంగా రూ.300 కోట్లతో పనులు చేపట్టారు. త్వరలోనే క్యాన్సర్ యూనిట్‌ను ఏర్పాటు చేయబోతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆస్పత్రిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

త్వరలోనే 65 పీజీ వైద్య సీట్లు..

ప్రస్తుతం 72 పీజీ వైద్యసీట్లు ఉండగా.. త్వరలో మరో 65 సీట్లు రానున్నాయి. దీనికోసం 60 శాతం అంటే రూ.48.8 కోట్లు కేంద్ర ప్రభుత్వం వ్యయం చేయనుండగా, మిగతా 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చనుంది. ఇప్పటికే ప్రతిపాదనలు ఎన్‌ఎంసీకి పంపించగా.. అక్కడి నుంచి అనుమతులు కూడా వచ్చాయి. దీనికోసం వసతుల కల్పన జరుగుతోంది.

సీట్ల కొనసాగింపుపై హర్షం

ప్రభుత్వ మెడికల్ కళాశాలకు 2023–24 విద్యా సంవత్సరానికి 150 ఎంబీబీఎస్ సీట్లను రెన్యూవల్ చేస్తూ నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) ఉత్తర్వులు జారీ చేసింది. కళాశాలలో పూర్తి ప్రమాణాలు పాటిస్తుండడం, ప్రొఫెసర్లు, బోధనా స్పత్రి నిర్వహణ అంశాలను పరిగణనలోకి తీసుకుని రెన్యూవల్‌కు అనుమతులు ఇచ్చింది. ప్రిన్సిపాల్ డాక్టర్ మైరెడ్డి నీరజ, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

అనుమతులు వచ్చాయి..

అనంతపురం మెడికల్ కాలేజీలో 150 ఎంబీబీఎస్ సీట్లకు వచ్చే ఏడాది అడ్మిషన్ చేసుకునేందుకు ఎన్‌ఎంసీ నుంచి అనుమతి వచ్చింది. తనిఖీల బృందం సంతృప్తి చెందిన తర్వాతే అనుమతులు ఇచ్చారు. త్వరలోనే పీజీ వైద్య సీట్లు కూడా రానున్నాయి. దీనికోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి.

–డాక్టర్ మైరెడ్డి నీరజ, ప్రిన్సిపాల్, గవర్నమెంట్ మెడికల్ కాలేజీ

ప్రాణం తీసిన అనుమానం

- భార్యను కత్తితో కడతేర్చిన భర్త



హత్యకు గురైన హేమలత

ఆత్మకూరు: భార్య ప్రవర్తనపై పెంచుకున్న అనుమానం పెనుభూతమైంది. భార్యను కత్తితో పొడిచి కడతేర్చిన భర్త ఉదంతం శుక్రవారం వై.కొత్తపల్లిలో జరిగింది. ఎస్‌ఐ రంగయాదవ్ తెలిపిన మేరకు.. వై.కొత్తపల్లికి చెందిన నరేంద్ర, హేమలత (31) దంపతులు. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం. వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. నరేంద్ర కొద్ది రోజులుగా భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్నాడు. వేరొకరితో వివాహేతర సంబంధం ఉందేమోనన్న అనుమానంతో రోజూ గొడవ పడేవాడు. ఈ క్రమంలోనే శుక్రవారం ఉదయం భార్యాభర్తలు వాదులాడుకున్నారు. కోపోద్రిక్తుడైన నరేంద్ర కత్తి తీసుకుని భార్యపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన హేమలత కొద్ది సేపటికే ప్రాణం విడిచింది. సమాచారం అందుకున్న సీఐ మోహన్, ఎస్‌ఐ రంగయాదవ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. హతురాలి తండ్రి తిప్పన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుడు నరేంద్ర పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

12న టీపీఎస్‌సీ చైర్మన్ రాక

అనంతపురం సప్తగిరి సర్కిల్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీపీఎస్‌సీ) చైర్మన్ బి.జనార్దన్‌రెడ్డి ఈ నెల 12న అనంతపురం రానున్నారు. రైలు మార్గం ద్వారా చేరుకుని అనంత క్రీడా మైదానంలోని వసతి గృహంలో ఆయన బస చేయనున్నారు. ఈ నెల 13న తిరిగి వెళ్లనున్నారు.

13న 'స్పందన' రద్దు

అనంతపురం అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో అధికారుల్లో నిమగ్నమై ఉన్నందున ఈ నెల 13న కలెక్టరేట్‌లో జరగాల్సిన 'స్పందన' కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, అర్జీలు ఇచ్చేందుకు జిల్లా కేంద్రానికి రావద్దని సూచించారు.

పేదింట పెళ్లికి ఆర్థిక తోడ్పాటు



మెగా చెక్కు విడుదల చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

- 309 దంపతులకు కల్యాణమస్తు, షాదీ తోఫా మంజూరు

అనంతపురం అర్బన్: పిల్లల చదువులు ప్రోత్సహించడం, బాల్య వివాహాలు నివారించడం లక్ష్యంగా వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాల ద్వారా ప్రభుత్వం పేద కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటునందిస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విశ్వమోహన్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా కింద ఎంపికైన లబ్ధిదారులకు కంప్యూటర్ బటన్ నొక్కి నగదును వారి ఖాతాల్లోకి జమ చేశారు. అనంతపురం కలెక్టరేట్ నుంచి సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విశ్వమోహన్‌రెడ్డి పాల్గొని మెగా చెక్కును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2022 అక్టోబరు – డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి 309 మంది దంపతులకు కల్యాణమస్తు, షాదీతోఫా కింద రూ.2,48,55,000 మంజూరయ్యిందన్నారు. ఈ పథకాల కింద ఎస్సీ, ఎస్టీలకు రూ.లక్ష, కులాంతర వివాహానికి రూ.1.20 లక్షలు, బీసీలకు రూ.50వేలు, కులాంతర వివాహానికి రూ.75 వేలు, మైనారిటీలకు రూ.లక్ష, దివ్యాంగులకు రూ.1.50 లక్షలు, గుర్తింపు ఉన్న భవన నిర్మాణ కార్మికులకు రూ.40 వేలు ప్రభుత్వం ఇస్తుందన్నారు. అర్హులైన నూతన వధూవరులు తమ వివాహం జరిగిన 30 రోజుల్లోగా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, ఏడీసీసీ బ్యాంక్, ఆర్టీసీ జోనల్, నాటక అకాడమీ, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్లు లిఖిత, మంజుల, హరిత, ఎల్ఎం ఉమాదేవి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు వరం



వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక తోడ్పాటు పేద కుటుంబాలకు వరం. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చాలామంది పేదలు తమ సంతానానికి వివాహం చేసేందుకు అప్పులు చేయాల్సి వస్తోంది. మాలాంటి పేదలకు ఆర్థిక సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు.

– సతీష్, శివలీల, అనంతపురం

బాల్యవివాహాలు తగ్గుతాయి



పేద కుటంబాలకు పిల్లలకు పెళ్లిళ్లు చేయడం ఆర్థికంగా భారమే. ప్రభుత్వం కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాల ద్వారా పేదలపై ఆర్థిక భారం తగ్గించింది. ముఖ్యవిషయం ఏమిటంటే పథకాలు పొందాలంటే తప్పనిసరిగా పదో తరగతి ఉత్తీర్ణత నిబంధన మంచి నిర్ణయం. దీనివల్ల బాల్యవివాహాలు తగ్గుతాయి.

– జిలాన్‌బాషా, మెహతాజ్, అనంతపురం

'బెస్ట్' విద్యార్థి ఆత్మహత్యాయత్నం

- ట్యూషన్ ఫీజు కోసం వేధింపులు
- పరీక్షకు అనుమతించని వర్సిటీ అధికారులు
- మనస్తాపంతో అగ్రి విద్యార్థి ఆత్మహత్యాయత్నం




ఆత్మహత్యకు ప్రయత్నించిన మనోహర్‌ను 108లో హిందూపురం తరలిస్తున్న దృశ్యం

గోరంట్ల: కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేదు. ట్యూషన్ ఫీజు చెల్లించకపోతే యూనివర్సిటీ అధికారులు పరీక్షలకు అనుమతించడం లేదు. ఏం చేయాలో తెలియని ఓ విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన శుక్రవారం గోరంట్లలో చోటుచేసుకుంది. స్థానికులు, బాధిత విద్యార్థి స్నేహితులు తెలిపిన వివరాల ప్రకారం....కొత్తచెరువుకు చెందిన మనోహర్ కమ్మలవాండ్లపల్లి సమీపంలోని బెస్ట్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఏజీబీఎస్సీ నాల్గో సంవత్సరం చదువుతున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగా లేకపోవడంతో యూనివర్సిటీకి చెల్లించాల్సిన ట్యూషన్ ఫీజులో కొంత మొత్తం చెల్లించలేకపోయాడు. దీంతో యూనివర్సిటీ అధికారులు అతన్ని శుక్రవారం నిర్వహించిన సెమిస్టర్ పరీక్షకు అనుమతించలేదు. దీంతో అతను తన కుటుంబ ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ తనకు గడువు ఇవ్వాలని కోరారు. అయినప్పటికీ యూనివర్సిటీ అధికారులు వినిపించుకోకపోవడంతో మనస్తాపం చెందాడు. శుక్రవారం సాయంత్రం గోరంట్లలోని తాను ఉంటున్న రూంలో క్రిమిసంహారక మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన తోటి విద్యార్థులు వెంటనే గోరంట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక వైద్యం చేయించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఐసీడీఎస్‌లో నిస్తేజం

- సీనియర్లను కాదని జూనియర్‌కు పెత్తనం
- అసంతృప్తిలో సీడీపీఓలు




ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం

అనంతపురం సెంట్రల్: మహిళా శిశు సంక్షేమ శాఖలో పాలన గాడి తప్పుతోంది. సీనియర్లను కాదని జూనియర్ సీడీపీఓకు ఇన్‌చార్జ్‌గా పెత్తనం కట్టబెట్టారు. దీంతో సీనియర్లు అసంతృప్తితో స్తబ్ధుగా ఉంటున్నారు. ఫలితంగా పనిలో దూకుడు కనిపించడం లేదు. ఐసీడీఎస్‌లో నిస్తేజం ఆవరించినట్లయ్యింది. జిల్లాల పునర్విభజన అనంతరం విజయనగరం సీడీపీఓగా ఉన్న సుశీలాదేవిని పదోన్నతిపై అనంతపురం పీడీగా నియమించారు. కొద్దినెలలకే ఆమె అనివార్యకారణాలతో గతేడాది ఆగస్టు నుంచి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయారు. దీంతో ఇన్‌చార్జ్ బాధ్యతలను ఓ జూనియర్ అధికారికి అప్పగించారు. అధికారులు తీసుకున్న ఈ నిర్ణయంపై అప్పట్లోనే విమర్శలు వ్యక్తమయ్యాయి. సెలవులో వెళ్లిన అధికారి త్వరలోనే వస్తారనే ప్రచారం రావడంతో అందరూ మిన్నకుండిపోయారు. కానీ నెలలు గడుస్తున్నా ఆమెనే కొనసాగిస్తుండడంపై చాలా మంది సీనియర్లు పెదవివిరుస్తున్నారు.

అప్పుడు.. ఇప్పుడు.. ఏక ఛత్రాధిపత్యం

గత ప్రభుత్వ హయాంలో ఓ ప్రజాప్రతినిధి పంచన చేరి ఐసీడీఎస్‌పై పెత్తనం చెలాయించిన అధికారికే మళ్లీ పెత్తనం కట్టబెట్టారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అప్పట్లో అంగన్‌వాడీ పోస్టుల భర్తీ నుంచి ఉద్యోగుల బదిలీల వరకూ చక్రం తిప్పారు. అలాంటి అధికారినే ఇప్పుడు ఇన్‌చార్జ్‌గా కొనసాగించడం పలువురికి రుచించడం లేదు. అనేక ఏళ్లుగా పనిచేస్తూ ప్రాజెక్ట్ డైరెక్టర్ రేసులో ఉన్నా కనీసం ఇన్‌చార్జ్ బాధ్యతలు కూడా దక్కకపోవడంపై నిరుత్సాహంతో ఉన్నారు. ఇది మహిళా శిశు సంక్షేమ శాఖ పాలనపై ప్రభావం చూపుతోంది. జిల్లాలో 2,302 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. వాటి పరిధిలో 15,245 మంది గర్భిణులు, 12,595 మంది బాలింతలు, 7,505 మంది చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. రక్తహీనత లేని సమాజ నిర్మాణంతో పాటు బాల్య వివాహాల నిర్మూలన, సంపూర్ణ అక్షరాస్యత సాధించడంలో కీలకపాత్ర పోషించడంలో సీడీపీఓలు కీలకపాత్ర పోషించాలి. కానీ జిల్లాలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. తరచూ ఏదో ఒకచోట బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల రాయదుర్గంలో ఓ బాలికను జోగినీగా మార్చేందుకు యత్నించిన ఘటన కూడా వెలుగుచూసింది. చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించకపోవడం, అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం తదితర కారణాల వల్ల లక్ష్యం నీరుగారుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పోక్సో కేసులో ముద్దాయికి రెండేళ్ల జైలు



తాడిపత్రి అర్బన్: పోక్సో కేసులో ముద్దాయికి రెండేళ్ల జైలు శిక్ష పడింది. 2021లో తాడిపత్రి పట్టణంలో శ్రీనివాసపురానికి చెందిన 14 ఏళ్ల బాలికపై నారాయణస్వామి అనే వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో 354డీ, 452, 506 ఐపీసీ, 11, 12 పోక్సో యాక్టు ప్రకారం (క్రైం నంబర్ 520ఐ 2021) కేసు నమోదైంది. అప్పట్లోనే నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. అప్పటి ఎస్‌ఐ ధరణీబాబు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అనంతపురం పోక్సో ప్రత్యేక కోర్టులో విచారణ జరిగింది. సాక్ష్యాధారాలను పరిశీలించిన మీదట నేరం రుజువు కావడంతో ముద్దాయి నారాయణస్వామికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.600 జరిమానా విధిస్తూ జడ్జి టి.రాజ్యలక్ష్మి శుక్రవారం తీర్పు వెలువరించారు. దర్యాప్తు అధికారిని, ప్రాసిక్యూషన్ తరఫున వాదించిన ఏపీపీ విద్యావతిని, కోర్టు కానిస్టేబుల్‌ను ఎస్పీ ఫక్కీరప్ప అభినందించారు.

బాధ్యతగా ఎన్నికల విధులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

- కోడ్ ఉల్లంఘన జరగకుండా చర్యలు

అనంతపురం అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల విధులు అధికారులు బాధ్యతగా నిర్వర్తించాలని, ఎక్కడా కోడ్ ఉల్లంఘన జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి నోడల్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ అంశంపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీకాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రీదేవితో కలిసి నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అదే విధంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డివిజన్, మండల స్థాయి అధికారులకూ తగు సూచనలిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ షెడ్యూల్ మేరకు ఈ నెల 16న నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. అదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు 21 మంది నోడల్ అధికారులను నియమించామన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం చేస్తే ఎన్నికల కమిషన్ తీవ్రంగా పరిగణిస్తుందని హెచ్చరించారు. రిటర్నింగ్ అధికారులు హ్యాండ్‌బుక్‌ను పూర్తిస్థాయిలో చదివి అవగాహన పెంచుకోవాలని సూచించారు. అప్పగించిన పనులను గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు అంశంపై అధికారులకు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఫిర్యాదుల స్వీకరణకు జిల్లా కేంద్రంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

నిబంధనలు అమలు కావాలి

ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పనిసరిగా అమలు కావాలని కలెక్టర్ పేర్కొన్నారు. మంత్రులు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనవచ్చని చెప్పారు. అయితే పట్టభద్రులు, ఉపాధ్యాయులు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్లను ప్రభావితం చేసేలా లేదా ప్రేరేపించేలా ప్రవర్తించరాదని ఎన్నికల కమిషన్ సూచించిందన్నారు. ఐటీ ప్లాట్‌ఫామ్ నుంచి ఎలాంటి ఇన్సెంటివ్‌లు ఇవ్వరాదన్నారు. స్థానిక సంస్థల పరిధిలో కొత్తగా పనులు చేపట్టరాదన్నారు. కొత్త పథకాలు ప్రకటించరాదని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో సమావేశాలకు అనుమతి కోరేవారికి 'ముందు వచ్చే వారికి ముందస్తు పద్ధతిలో' అనుమతి ఇస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్, కౌంటింగ్‌కు వేరువేరుగా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. బందోబస్తు ప్రణాళిక ముందస్తుగా సిద్ధం చేసుకోవాలన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. శుక్రవారం మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి గురించి వివరించారు. ఎన్నికల నిర్వహణలో అధికార యంత్రాంగానికి సహకరించాలని సూచించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన పాలాక్షిగౌడ్

ఉరవకొండ: స్థానిక అనంతపురం–బళ్లారి జాతీయ రహదారి వద్ద పెట్రోల్ బంకు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. వై.రాంపురం గ్రామానికి చెందిన పాలాక్షిగౌడ్(55) బళ్లారిలోని మోకాలో జరిగే బైక్‌పై బయలుదేరాడు. ఉరవకొండ బైపాస్ వద్ద ఆగి ఉన్న ఆటోను వెనుక వైపు నుంచి ఢీకొన్నాడు. ఘటనలో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో హుటాహుటిన ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు అనంతపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో అక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

లారీ ఢీ కొన్న ఘటనలో..

తాడిపత్రి: వంగనూరు క్రాసింగ్ సమీపంలో తాడిపత్రి – కడప ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనాన్ని లారీ ఢీ కొన్న ఘటనలో ఓ వ్యక్తి చెందాడు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. వంగనూరు గ్రామానికి చెందిన నరసింహ, లక్ష్మీనారాయణ(35) పక్కనే ఉన్న బొందలదిన్నెకు వెళ్లి తిరిగి గ్రామానికి బయలుదేరారు. వంగనూరు క్రాసింగ్ వద్దకు రాగానే ఎదురుగా కడప వైపు వెళుతున్న లారీ వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చున్న లక్ష్మీనారాయణ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. నరసింహకు చేయి విరిగింది. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడు నరసింహను తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లక్ష్మీనారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య శోభ, ముగ్గురు సంతానం ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పెరగనున్న ఉష్ణోగ్రతలు

బుక్కరాయసముద్రం: జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు మధ్యాహ్నం 34.6 నుంచి 35.3 రాత్రి 18.2–19 డిగ్రీల సెల్సియస్ నమోదు కావొచ్చని రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త అశోక్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాలిలో తేమ శాతం ఉదయం 72–77, మధ్యాహ్నం 27–32గా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం


వాలీబాల్ ఆడుతున్న బాలికలు


హాకీలో తలపడుతున్న క్రీడాకారులు


టెన్నిస్ డబుల్స్ చాంపియన్‌గా నిలిచిన నరసింహ, శంకరన్న జోడికి ట్రోఫీని అందిస్తున్న ముఖ్య అతిథులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు శుక్రవారం స్థానిక అనంత క్రీడా మైదానం, అశోక్ నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. క్రీడాకారులు ఉన్నతంగా రాణించేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. రెండు రోజుల పాటు క్రీడా పోటీలను నిర్వహించేందుకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకున్నామన్నారు. క్రీడాకారులు బాగా రాణించి జిల్లా కీర్తిని రాష్ట్ర స్థాయిలో చాటాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఖోఖో, హాకీ, హ్యాండ్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నిస్, అథ్లెటిక్స్ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా చీఫ్ కోచ్‌లు జగన్నాథరెడ్డి, వెంకటరమణ, పీడీలు కేశవమూర్తి, సిరాజ్, నగేష్, శ్రీనివాసులు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఏ1 రఫి, కోచ్‌లు జబీవుల్లా, నరేష్, అనిల్, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్ రెడ్డి మృతికి నివాళి..

రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ కార్యదర్శి పవన్‌కుమార్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడి బెంగళూరులో చికిత్స పొందుతూ మృతి చెందడంతో ఆయన మృతికి మౌనం పాటించి నివాళులర్పించారు. ఆయన మృతి క్రీడాలోకానికి తీరని లోటని అధికారులు పేర్కొన్నారు.

టెన్నిస్ డబుల్స్ విజేత నరసింహ, శంకరన్న జోడి..

ఏపీ సీఎం కప్ జిల్లా స్థాయి పోటీల్లో శుక్రవారం నిర్వహించిన టెన్నిస్ పోటీల్లో డబుల్స్ విభాగం విజేతలుగా నరసింహ, శంకరన్న జోడి నిలిచింది. గుంతకల్లుకు చెందిన ఆరోన్ రోనాల్డిన్హో, హిందూపురానికి చెందిన గౌతం రెడ్డి జోడిపై 6–4తో విజయం సాధించి జిల్లా చాంపియన్‌షిప్‌ను దక్కించుకున్నారు. శంకరన్న నగరంలోని నంబర్–02 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీడీగా వ్యవహరిస్తున్నారు. ఆయన ఇటీవల వెటరన్స్ టోర్నీలోను ఆల్ ఇండియా 15వ ర్యాంకును సాధించి ప్రతిభను చాటుకున్నారు. ఆయనను పలువురు పీడీలు, పీఈటీలు ప్రత్యేకంగా అభినందించారు.

వెటర్నరీ ఉద్యోగి అనుమానాస్పద మృతి


మృతుడు రాజేష్ (ఫైల్)

తాడిపత్రి: తాడిపత్రి వెటర్నరీ ప్రభుత్వాస్పత్రిలో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాజేష్(43) పెన్నానదిలోని ఓ నీటి కుంటలో శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెంది కనిపించాడు. వివరాలు.. తాడిపత్రి పట్టణంలోని నందలపాడుకు చెందిన రాజేష్ అప్పుల వారి ఒత్తిడి ఎక్కువై ఈ నెల 7 న రాత్రి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని రాసి ఉన్న పేపర్‌ను తన సంతకం లేకుండా పశువైద్యశాల ఉద్యోగుల జిల్లా గ్రూప్‌లో వాట్సాప్ చేసి కనిపించకుండా పోయాడు. అయితే 8 వ తేదీ ఉదయం రాజేష్ విధులకు హాజరుకాకపోవడంతో పట్టణ పోలీసులకు వైద్యాధికారి, ఏడీ ఖదీర్‌బాషా సమాచారం అందించారు. అనంతరం పట్టణ పోలీసులు రాజేష్ కోసం గాలింపులు చేపట్టినా ఫలితం దక్కలేదు. రెండు రోజుల క్రితం రాజేష్‌కు చెందిన మొబైల్ పెన్నానదిలో ఇసుకను తరలిస్తున్న ఓ ఎడ్లబండి యజమానికి దొరకడంతో పోలీసులు అతడిని విచారించారు. మొబైల్ లభించిన ప్రదేశంలో వెతకగా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్నారు. శుక్రవారం ఉదయం అటుగా వెళ్లిన కొందరు స్థానికులకు పెన్నానదిలోని నీటి కుంటలో ఓ మృతదేహం పడి ఉన్నట్లు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ ఘటనా స్థలానికి వెళ్లి మృతుడు రాజేష్‌గా గుర్తించారు. మద్యం మత్తులో ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి మృతి చెందాడా లేక అప్పులు ఎక్కువై ఆత్మహత్య చేసుకున్నాడా, లేక మరేదైనా కారణమా అన్నది పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది. మృతుడికి భార్య సంతోషమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాజేష్ తల్లి సత్యవతి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకు మృతి

కనగానపల్లి: పర్వతదేవరపల్లి సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మడకశిరకు చెందిన హనుమంతు(45) విద్యుత్‌శాఖ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. తన తల్లి చెన్నమ్మ (85) మధుమేహంతో బాధపడుతుండగా, అనంతపురంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించేందుకు శుక్రవారం కారులో బయలుదేరాడు. వీరు ప్రయాణిస్తున్న కారు పర్వతదేవరపల్లి సమీపంలోని రాగానే ముందు చక్రం పగిలిపోయింది. కారు అదుపు తప్పి రహదారి పక్కన గుంతల్లోకి వెళ్లి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో హనుమంతుతో పాటు చెన్నమ్మ కూడా తీవ్రంగా గాయపడింది. వెంటనే స్పందించిన హైవే పెట్రోలింగ్ సిబ్బంది వారిని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా...మార్గమధ్యంలోనే ఇద్దరూ మృతి చెందారు. హనుమంతుకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తాడిపత్రిలో ప్రశాంతత వారికి ఇష్టం లేదు

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెలే కేతిరెడ్డి పెద్దారెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: తాడిపత్రి ప్రాంతం ప్రశాంతంగా ఉండడం జేసీ సోదరులకు ఇష్టం లేదని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఇసుక రీచ్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని, వాటి అనుమతులు అధికారులను అడిగి తీసుకోవాలన్నారు. ఏదో ఒక విషయంలో జేసీ సోదరులు సమస్యలు సృష్టిస్తున్నారన్నారు. గ్రామాల్లో రెచ్చగొట్టి ఘర్షణలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు డ్యాములు కట్టామని చెబుతారని, వాటికి నీరు తెచ్చినప్పుడే చెప్పాలన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక వ్యవసాయానికి పెద్దపీట వేశామని, ఇది వారికి నచ్చలేదన్నారు. తాడిపత్రిలో ప్రజలను బానిసలుగా కాకుండా వారిలో మార్పు తీసుకొచ్చామన్నారు. అది జీర్ణించుకోలేక గొడవలు పెడుతున్నారన్నారు. తనపై జేసీ సోదరులు మాట్లాడినప్పుడే స్పందిస్తాను తప్ప తాను ఎప్పుడూ ఊరికే మాట్లాడనన్నారు. పెద్దపప్పూరులోని ఇసుక రీచ్‌కు తనకు ఎలాంటి సంబంధం లేదని, అందులోని టిప్పర్లు ఎవరివో అధికారులనే అడగాలన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి అక్కడికెళ్లి శాంతిభద్రతలకు భంగం వాటిల్లేలా ప్రవర్తించడం సరికాదన్నారు. ఆయన అక్కడికెళ్లి బెదిరిస్తున్నారంటే గుడ్‌విల్ కోసమే, డబ్బుకోసమే ఉంటుందని ఆరోపించారు. జేసీకి సమాచారం కావాలంటే మైనింగ్ అధికారుల వద్దకు వెళ్లాలన్నారు.

లోకేష్ పాదయాత్ర నవ్వులపాలు


మాట్లాడుతున్న దేరంగుల ఉదయ్‌కిరణ్

పామిడి: టీడీపీ నేత నారా లోకేష్ ఏమాత్రం ప్రజాబలం లేకుండా యువగళం పేరుతో చేస్తున్న పాదయాత్ర నవ్వులపాలవుతోందని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు దేరంగుల ఉదయ్‌కిరణ్ ఎద్దేవా చేశారు. శుక్రవారం పామిడికి విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏమాత్రం రాజకీయపరిణితి లేని ముద్దుపప్పు, చేతకాని నారాలోకేష్ పాదయాత్ర చేసి తొడలు మంటలు పుట్టించుకోవడం తప్పా ఒరిగిందేమీ లేదన్నారు. సాక్షాత్తు పచ్చపార్టీ నాయకులే జనం లేని పాదయాత్ర చూసి తలలు పట్టుకుంటున్నారన్నారు. పచ్చమీడియా ఎంతపైకి లేపాలని చూసినా ఉన్న ఓట్లు కూడా రాకుండా పోతాయేమోనన్న భయం తెలుగుతమ్ముళ్లకు పట్టుకుందన్నారు. అటు చంద్రన్న ఆదేశాలు ధిక్కరించలేక ఇటు ప్రజాకర్షణ లేని లోకేష్ పాదయాత్ర వెలవెలబోతుంటే ఇంత కంటే దౌర్భాగ్యం ఏమైనా ఉందా? అంటూ ప్రశ్నించారు. ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో గెలవలేని లోకేష్, రాష్ట్రాన్ని ఉద్ధరిస్తాననడాన్ని ప్రజలు ఎలా నమ్ముతారన్నారు. లోకేష్ పాదయాత్ర ద్వారా పార్టీకి ఒరిగేది గుండుసున్నా అన్నది స్పష్టమవుతోందన్న గుసగుసలు తెలుగు తమ్ముళ్ల నుంచే వ్యక్తమవుతున్నాయన్నారు. ఏదో వంకపెట్టి లోకేష్ పాదయాత్ర ముగించడం తథ్యమని జోస్యం చెప్పారు.

అభాగ్యులకు 'అమ్మ'

- ఆపన్నులకు అండగా నిలుస్తున్న 'అమ్మ' సంస్థ
- మదర్ థెరిస్సా స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు
- పలువురి ప్రశంసలు అందుకుంటున్న నిర్వాహకుడు రమణారెడ్డి


ఆర్థికసాయం అందిస్తున్న రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: కంబదూరు మండలం మరిమేకలపల్లెకు చెందిన ఆంజనేయులు వెన్నెముక సమస్యతో మంచానికి పరిమితమయ్యాడు. తల్లిదండ్రులు కోలమ్మ, లక్ష్మీనారాయణ కొడుకు బాధ చూడలేక తల్లడిల్లిపోతుంటే అమ్మ సంస్థ అధ్యక్షుడు రమణారెడ్డి మానవత్వంతో స్పందించారు. రూ.లక్షా 50 వేల నగదు అందించడంతో పాటు తానే అంబులెన్సు మాట్లాడి మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు పంపించాడు. ఒక ఆంజనేయులు విషయంలోనే కాదు.. ఇలాంటి నిరుపేదలు, వికలాంగులెందరికో అమ్మ సంస్థ అండగా నిలిచింది.

మదర్‌థెరిస్సా స్ఫూర్తితో..

శింగనమల మండలం తరిమెల గ్రామానికి చెందిన జయప్రసాదరెడ్డి, స్వరాజ్యమ్మ దంపతుల కుమారుడైన రమణారెడ్డి వ్యవసాయ కుటుంబానికి చెందినవారు. 'ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న' అన్న మదర్ థెరిస్సా మాటలు ఆయనలో స్ఫూర్తి నింపాయి. అభాగ్యులకు అండగా నిలవాలని భావించి 'అమ్మ' స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. ఈ సంస్థ ద్వారా కొన్నేళ్లుగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. దివ్యాంగులతో పాటు పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు, అనారోగ్యంతో బాధపడేవారికి, ఇతరత్రా బాధితులకు నగదు, నిత్యావసరాలు, ఇతరత్రా సామగ్రిని అందజేస్తూ అండగా నిలుస్తున్నారు. ఇప్పటి దాకా 300లకు పైగా పేద కుటుంబాలకు అండగా నిలిచారు. పలువురు విద్యార్థులను దత్తత తీసుకుని వారికి చదువు పూర్తయ్యే వరకు అండగా నిలుస్తున్నారు. మరెంతో మందికి వైద్య ఖర్చులు, మందులు సమకూరుస్తున్నారు.

సొంత నిధులతోనే సాయం


రమణారెడ్డికి సొంతూరు తరిమెలలో వ్యవసాయంతో పాటు అనంతపురంలో వ్యాపారాలు ఉన్నాయి. వాటి ద్వారా వచ్చే ఆదాయంలో కొంత మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తున్నారు. ఇతరుల నుంచి పైసా ఆశించకుండా సొంత నిధులతోనే సేవా కార్యక్రమాలు చేపడుతుండడాన్ని పలువురు అభినందిస్తున్నారు.

'అమ్మ' తోడ్పాటు మరువలేను

నా భర్త అనారోగ్యంతో మరణించి అసలే ఇబ్బందుల్లో ఉంటే గోరు చుట్టుపై రోకటి పోటన్నట్టు ఓ ప్రమాదంలో నేనూ నా కొడుకు మహ్మద్ రఫీ తీవ్రంగా గాయపడ్డాం. ఎవ్వరూ చూడలేదు. విషయం తెలుసుకున్న 'అమ్మ' రమణారెడ్డి ముందుకు వచ్చి సర్జికల్ మంచం, రెండునెలల భత్యం, మందులు, నగదు ఇచ్చి వెళ్లారు. మానవత్వం ఇంకా మిగిలే ఉందని మాకెప్పుడూ అనిపిస్తూ ఉంటుంది.

– నూర్జహాన్, నాయక్‌నగర్, అనంతపురం

కుటుంబ సహకారంతోనే సాధ్యం



పేదరికమనేది డబ్బులో ఉండదు. మన భావనల్లోనే ఉంటుంది. ఉన్నంతలో ఇతరులకు పంచడమన్నది అందరూ ప్రారంభిస్తే, తోటి వారి కష్టసుఖాలలో పాలు పంచుకోవడం ఆరంభిస్తే అభాగ్యులు, అనాథల హృదయాలలో గూడు కట్టుకున్న బాధలకు కొంతైనా ఉపశమనం కలుగుతుంది. నా భార్య లక్ష్మీ, కుమారుడు సాయి సిద్ధార్థరెడ్డి ప్రోత్సాహం, సహకారం వల్లే సేవా కార్యక్రమాలను కొనసాగించగలుగుతున్నా. భవిష్యత్తులో మరింత విస్తృతం చేయాలన్న ఆకాంక్ష బలంగా ఉంది.

– తరిమెల రమణారెడ్డి, అమ్మ సంస్థ వ్యవస్థాపకుడు

13 నుంచి సేవాలాల్ జయంత్యుత్సవాలు

అనంతపురం సిటీ: ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు గుత్తి సమీపంలోని సేవాఘడ్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంత్యుత్సవాలను నిర్వహించనున్నారు. ఈమేరకు ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆవిష్కరించారు. సంత్‌సేవాలాల్ చారిటబుల్ ట్రస్ట్ జనరల్ సెక్రటరీ అశ్వత్థనాయక్, ట్రెజరర్ బాలానాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జిల్లా అధ్యక్షుడు బాలాజీనాయక్, జనరల్ సెక్రటరీ బాబూ నాయక్ తదితరులు జిల్లా పరిషత్ ఆవరణలోని క్యాంప్ కార్యాలయంలో చైర్‌పర్సన్‌ను శుక్రవారం సాయంత్రం కలిశారు. జయంత్యుత్సవాలకు రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సేవాలాల్ గురించి ప్రతినిధులు ఆమెకు వివరించారు. అనంతరం పోస్టర్లను విడుదల చేసి ఆమె మాట్లాడారు. దేశ విదేశాల్లో ఉంటున్న బంజారాలందరూ తరలివచ్చి, సేవాలాల్ అనుగ్రహం పొందాలన్నారు. మూడ్రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో కుల మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు.

యువకుడి ఆత్మహత్య

కుందుర్పి: మండలంలోని అప్పిలేపల్లి గ్రామంలో పెళ్లికాలేదనే మనస్థాపంతో ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఆంజనేయులు,చెన్నక్క కుమారుడు రఘు(26)మద్యానికి బానిసై అల్లరిచిల్లరిగా తిరిగే వాడు. తనకు పెళ్లి చేయాలని కోరేవాడు. ఈక్రమంలో గురువారం రాత్రి తనకు వారం రోజుల్లో పెళ్లి చేయాలని తల్లి దండ్రులను కోరారు. అల్లరిచిల్లరిగా తిరిగితే పిల్లను ఎవరిస్తారని వారు మందలించారు. తీవ్రమనస్థాపానికి గురైన రఘు గ్రామ శివారులోని చింత చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


మృతి చెందిన గొల్ల తిమ్మయ్య

కణేకల్లు: కళ్యాణదుర్గం –బళ్లారి రోడ్డుపై నాగిరెడ్డిపల్లి శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఎస్‌ఐ దుగ్గిరెడ్డి కథనం మేరకు..కళ్యాణదుర్గం మండలం దొడగట్టకు చెందిన గొల్ల తిమ్మయ్య (60) పని నిమిత్తం బొమ్మనహాళ్‌కు వెళ్లి రాత్రి బైక్‌లో తిరుగు పయనమయ్యాడు. ఊరికి వెళుతున్న సమయంలో నాగిరెడ్డిపల్లి–పులచెర్ల మధ్య కళ్యాణదుర్గం నుంచిబళ్లారికెళుతున్న ఎర్టిగ కారు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన తిమ్మయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొట్టి...పెట్రోలు పోసి నిప్పంటించారు

- యలహంకలో పరిగి మండల వాసి దారుణ హత్య


శ్రీధర్ (ఫైల్)

పరిగి: మండలంలోని శాసనకోట గ్రామానికి చెందిన శ్రీధర్(34) కర్ణాటక రాష్ట్రం యలహంకలో దారుణ హత్యకు గురయ్యారు. మృతుని కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు... శాసనకోటకు చెందిన శ్రీధర్ బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఫిజియోథెరపిస్ట్‌గా పనిచేసేవాడు. కొన్నేళ్లుగా తల్లిదండ్రులు ఖాద్రెప్ప, లక్ష్మమ్మ, అన్న ప్రసాద్‌తో కలిసి యలహంకలో నివాసం ఉంటున్నాడు. నాలుగు రోజుల క్రితం శ్రీధర్ అదృశ్యం కావడంతో కుటుంబీకులు బంధువుల వద్ద, సమీప ప్రాంతాల్లో ఆరా తీశారు. అయినా ఫలితం లేకపోయింది. ఈక్రమంలోనే యలహంక సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో ఓ మనిషి మృతదేహం కాలిపోయిన స్థితిలో ఉండగా పోలీసులు కనుగొన్నారు. దీంతో అక్కడి పోలీసులు మృతుని వివరాల కోసం పత్రికల్లో ప్రకటన ఇచ్చారు. దీంతో అనుమానంతో అక్కడికి వెళ్లిన శ్రీధర్ సోదరుడు ప్రసాద్ అది తన తమ్ముడి మృతదేహమేనని గుర్తించాడు. దీంతో పోలీసులు మృతదేహం నుంచి నమూనాలు సేకరించి డీఎన్‌ఏ టెస్టుకు పంపగా..మృతదేహం శ్రీధర్‌దేనని తేలడంతో పోస్టు మార్టం నిర్వహించారు. అనంతరం శుక్రవారం మృతదేహాన్ని శాసనకోటకు తీసుకొచ్చి దహన సంస్కారాలు నిర్వహించారు. శ్రీధర్‌ను బాగా కొట్టి చంపిన దుండగులు మృతదేహాన్ని గుర్తు పట్టకుండా ఉండేందుకు పెట్రోలు పోసి నిప్పంటించి ఉండవచ్చని బంధువులు అనుమానిస్తున్నారు.

అన్నదాన భవనం ప్రారంభం

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయానికి సమీపంలో నిర్మించిన అన్నదాన భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఆగమికులు సునీల్‌కుమార్ శర్మ నేతృత్వంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఉదయం 4 గంటలకు గోపూజ, సింహద్వారా మహాలక్ష్మి పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద భవనాన్ని ప్రారంభించారు. దేవిభాగవతంలోని దుర్గాదేవి మహాత్యం వివరించారు. చండీహోమ కర్తలుగా మాజీమంత్రి రఘువీరారెడ్డి, తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్, ప్రముఖ న్యాయవాది శివమూర్తి దంపతులు నిర్వహించారు. అన్నదాన సేవా ట్రస్ట్ సభ్యులు రామాంజనేయులు, రాంప్రసాద్, అంజినరెడ్డి మాట్లాడుతూ... రూ.60 లక్షల వ్యయంతో అన్నదాన దాన భవనాన్ని నిర్విఘ్నంగా పూర్తి చేశామన్నారు. వీరభద్రాలయానికి వచ్చే పర్యాటకులకు మధ్యాహ్నం భోజన సదుపాయాన్ని కల్పించడమే శ్రీదుర్గా, పాపనాశేశ్వర, వీరభద్రస్వామి అన్నప్రసాద సేవా ట్రస్ట్ ప్రధాన ధ్యేయమన్నారు. అన్నదాన భవనానికి ఆర్థిక సహకారం అందించిన ప్రతి ఒక్కరికి ట్రస్ట్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ యశ్వంత్, హిందూపురం రూరల్ సీఐ వేణుగోపాల్, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు కుల నిర్మూలన పోరాట సమితి మహాసభలు

అనంతపురం టవర్ క్లాక్: నగరంలోని ఎన్జీఓ హోంలో ఆదివారం కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా మూడవ మహాసభలు జరగనున్నాయి. రాష్ట్ర నాయకులు హాజరు కానున్నారు. ఉమ్మడి జిల్లాలోని సమితి నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

ఆహార వృథాను అరికట్టేలా పరిశోధనలు

అనంతపురం: ప్రపంచ వ్యాప్తంగా ఉన్న జనాభాకు అనుగుణంగా ఆహారం దక్కాలంటే ఆహార వృథాను అరికట్టే పరిశోధనలు విస్తృతంగా కొనసాగాలని జేఎన్టీయూఏ వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన ఆకాంక్షించారు. జేఎన్టీయూఏ అనుబంధ ఓటీపీఆర్ఐలో శుక్రవారం ఫుడ్ టెక్నాలజీ విద్యార్థులకు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి వీసీ ఓటీపీఆర్ఐ విశిష్టతను, ఫుడ్ టెక్నాలజీ కోర్సు ప్రాముఖ్యతను వివరించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఫుడ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్‌కు చెందిన ఆచార్య ఎ.స్వరూపరాణి, డాక్టర్ ఎస్.విజయలక్ష్మి, డాక్టర్ జె.సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి సన్మానం



సంజయ్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రైవేటు పాఠశాలల నాయకులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి కుమారుడు సంజయ్‌రెడ్డి జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ అండర్–14 పోటీలకు ఎంపికయ్యాడు. శుక్రవారం అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో క్రీడాకారుడిని నాయకులు అభినందించి, సన్మానం చేశారు. కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, కార్యదర్శి రమణారెడ్డి, రవిచంద్రారెడ్డి, కోశాధికారి రామచంద్ర, సభ్యులు చంద్రశేఖరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, విజయ్‌కుమార్, జానకిరాములు, మల్లేశు, చిత్తయ్య, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఈత పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఆత్మకూరు: మండల పరిధిలోని తోపుదుర్తి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఈత పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. ఈనెల 9వ తేదీన అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయిలో పోటీల్లో పాఠశాలకు చెందిన చందు, శ్రీకన్య, రవితేజ, చిన్న, వనజ విశేష ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. 12వ తేదీ విజయవాడలో జరిగే ఈత పోటీల్లో పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను పీడీ శ్రీవాణితో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడలతోనే క్రమశిక్షణ



యోగా విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

అనంతపురం: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగడానికి క్రీడలు దోహదపడతాయని నగరంలోని ట్రిల్లిస్ స్కూల్ వ్యవస్థాపకుడు, చైర్మన్ శ్రీకాంత్ వద్ద అన్నారు. ట్రిల్లిస్ స్కూల్‌లో శుక్రవారం స్పోర్ట్స్‌డేని నిర్వహించారు. ముఖ్య అతిథిగా చైర్మన్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు నిర్వహించిన ఫ్లవర్ డ్రిల్, డంబెల్ డ్రిల్, హుప్స్‌డ్రిల్, యోగా, మ్యూజిక్ వంటి అద్భుతమైన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ట్రిల్లిస్ పాఠశాల అధ్యక్షుడు వెంకట సిరిదీప్ తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన శ్రీశైలానికి..



శ్రీశైలానికి బయలుదేరిన శివ మాలధారులు

రాప్తాడురూరల్: అనంతపురం, రాప్తాడు మండలాలకు చెందిన పలువురు శివమాలధారులు కాలినడకన శుక్రవారం శ్రీశైలానికి బయల్దేరి వెళ్లారు. కాలినకడన వెళ్లిన వారిలో గుజ్జల ఈశ్వరయ్య, మురళి, రెడ్డప్ప, రాము, రమేష్ బాబు, యల్లప్ప, మల్లన్న ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

కనగానపల్లి: డెంగీ, మలేరియా వంటి విష జ్వరాలు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సబ్ డివిజనల్ మలేరియా అధికారి జయరాం నాయక్ సూచించారు. శుక్రవారం మండలంలోని తగరకుంట గ్రామంలో ఆరోగ్య సిబ్బంది డ్రైడే నిర్వహించారు.


హర హర శంభో..

- నేటి నుంచి శైవ క్షేత్రాల్లో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు
- జిల్లా వ్యాప్తంగా మార్మోగనున్న శివనామ స్మరణ



నిత్యపూజలందుకుంటున్న కాశీవిశ్వేశ్వరుడు

అనంతపురం కల్చరల్: మహా శివరాత్రిని పురస్కరించుకుని జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన శైవ క్షేత్రాల్లో ఈ నెల 11 నుంచి 21 వరకూ బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో శివనామస్మరణ మార్మోగనుంది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని అనంతపురంలోని మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. శనివారం ఉదయం దీక్షా హోమంతో ప్రారంభమయ్యే ఉత్సవాల్లో అదే రోజు సాయంత్రం మయూర వాహనంపై ఆది దంపతులు నగరవీధుల్లో విహరించనున్నారున. 12న వ్యాఘ్ర వాహనం, 13న శేషవాహనం, 14న హంస వాహనం, 15న రావణబ్రహ్మ వాహనం, 16న గజవాహనం, 17న కైలాస వాహనం, 18న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని



అనంతపురం నగరంలోని కాశీవిశ్వేశ్వరాలయ ఆలయ గోపురం

శివపార్వతుల కల్యాణోత్సవంతో పాటు నంది వాహన సేవ ఉంటుంది. 19న బ్రహ్మ రథంపై జగజ్జనని విశాలాక్షి సమేతంగా దేవదేవుడు ఊరేగనున్నాడు. 20న అశ్వవాహన సేవ, అలకోత్సవం, 21న వసంతోత్సవం, రాత్రి శయనోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ మేరకు వివరాలను ఆలయ ఈఓ సుధారాణి, పాలక మండలి సభ్యులు తిమ్మారెడ్డి, వెంకటస్వామి, చంద్ర, ప్రధాన అర్చకులు నరసింహశాస్త్రి, కిషోర్ తదితరులు తెలిపారు.

మహిమాన్విత క్షేత్రం

అనంతపురం మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం ఎన్నో విశిష్టతలకు కేంద్రంగా ఉంటోంది. దీనికి తోడు ఈ ఏడాది ఆలయ శత వసంతోత్సవాలు జరుపుకుంటున్న నేపథ్యంలో వస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను మరింత శోభాయమానంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వందేళ్ల క్రితం కాశీ క్షేత్రం నుంచి హోసూరు రామస్వామి అనే భక్తుడు శివలింగాన్ని పాదయాత్రగా తీసుకువచ్చి ప్రతిష్టించారు. దీంతో ఇక్కడి మహాదేవుడిని కాశీవిశ్వేశ్వరుడిగా భక్తులు కొలుస్తున్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



అనంతపురంలో బంద్ పాటిస్తున్న విద్యార్థి నాయకులు

అనంతపురం: ఫీజుల దోపిడీని అరికట్టాలని, నారాయణ కళాశాలను సీజ్ చేయాలని విద్యార్థి సంఘాలు శుక్రవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. కార్పొరేట్ విద్యాసంస్థలు మాఫియాగా ఏర్పడి ఫీజుల పేరుతో తల్లిదండ్రులను దోచుకుంటున్నాయని నాయకులు ఆరోపించారు. ఫీజు ఒత్తిళ్లు భరించలేక నారాయణ జూనియర్ కళాశాలలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసినప్పటికీ చర్యలు తీసుకోని ఆర్ఐఓను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుళ్లాయిస్వామి, కార్యదర్శి చిరంజీవి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, ఏపీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల రాఘవేంద్ర, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి రమణయ్య, నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉమా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ కళాశాలను సీజ్ చేయాలి

అనంతపురం అర్బన్: విద్యార్థినుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నారాయణ కళాశాలను సీజ్ చేయాలని ఏబీఎస్‌బీ (అఖిల భారత విద్యార్థి బ్లాక్) నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్ష చేశారు. ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి పృథ్వీ మాట్లాడుతూ నారాయణ కళాశాలను సీజ్ చేయడంతో పాటు చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతి లేకుండానే కోర్సులు నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెట్టి పెద్దమొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని కళాశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆర్ఐఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు విష్ణు, మారుతి, శంకర్, విజయ్, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన హుండీ ఆదాయం

అనంతపురం కల్చరల్: మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో శుక్రవారం సాయంత్రం హుండీ కానుకలను ప్రధాన అర్చక బృందం, కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. ఈఓ సుధారాణి, ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గతంలో రూ.3.50 లక్షలున్న కాశీవిశ్వేశ్వరుని హుండీ ఆదాయం ఈసారి రూ.4,32,857కు పెరిగిందన్నారు. మహాశివరాత్రికి ముందు హుండీ లెక్కింపు, బ్రహ్మోత్సవాలు ముగిసిన అనంతరం మరోసారి లెక్కించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈసారి భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు.

గృహ సారథులే జగనన్న రథసారథులు





శిక్షణకు హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తదితరులు

- శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు: సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులే జగనన్న రథసారథులని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాప్తాడులోని నూతన సచివాలయ భవనం దగ్గర ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి అధ్యక్షతన మండలంలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మార్కెట్ యార్డ్ చైర్మన్ బెడదూరి గోపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థతో పాలనను గ్రామస్థాయికి తీసుకువెళ్లారన్నారు. నవరత్నాల పథకాల ద్వారా జనరంజక పాలన సాగిస్తున్నారన్నారు. జగనన్న అమలు చేసిన పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. అందుకు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో కలిసి పని చేయాలన్నారు. ఒక్కో కుటుంబాలకు చేకూరిన లబ్ధి, వార్డు, మండలం, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి గురించి తెలియజేయాలన్నారు. వంట గ్యాస్, పెట్రోలు, గేజిల్ ఇతర నిత్యావసరాల పెరుగుదల అంశాలు కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అంశాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రాభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తున్నా ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా కుట్రలు, టీడీపీ పాలనలోని వైఫల్యాలను వివరించాలన్నారు. అందుకు మీరంతా జగనన్న కుటుంబంలా పని చేయాలన్నారు. 2024లో ఎన్నికలే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకువస్తే మరో 25 ఏళ్ల పాటు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండటం తథ్యమన్నారు. గడిచిన మూడున్నరేళ్లలో ఏ విధంగా పార్టీకి పనిచేశారో మరో ఒకటిన్నర సంవత్సరం పాటు రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలన్నారు. ఈ నెల 20 నుంచి 27 వరకు ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయాలను సేకరించాలన్నారు. ఏ ఒక్క అర్హుడికి అన్యాయం జరగకూడదనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు.

వైఎస్సార్ సీపీ 175 సీట్లు గెలవడం ఖాయం

టీడీపీ నేతలు ఎన్ని కుట్రలు చేసినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175 సీట్లు విజయం సాధించడం ఖాయమన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏది చెప్పినా కచ్చితంగా చేసి తీరుతారన్నారు. ఇప్పటికే 98 శాతం హామీరు నెరవేర్చారని, కులం, మతం, ప్రాంతం పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించారన్నారు. అందువల్ల జగనన్నను మరోసారి సీఎంగా చూసేందుకు అందరం కష్టపడి పనిచేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం ×మా నమ్మకం నువ్వే జగన్౯ గృహ సారథులకు ప్రభుత్వ పథకాల ప్రచార సాధన కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ప్రతి గడపకూ వెళ్లి ప్రజల అభీష్టం మేరకు వారి ఇళ్లకు ×మా నమ్మకం నువ్వే జగన్౯ స్టిక్కర్లను అతికించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ విభాగం మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, మరూరు సొసైటీ అధ్యక్షుడు మాచిరెడ్డి కొండారెడ్డి, అగ్రి బోర్డు చైర్మన్ కేశవ రెడ్డి, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, నాయకులు మాచిరెడ్డి చెన్నారెడ్డి తదితరులు హాజరయ్యారు.

ఒత్తిడిని జయిస్తేనే సంపూర్ణ ఆరోగ్యం

అనంతపురం రూరల్: మానసిక ఒత్తిడిని జయిస్తే మనిషి సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని ×దిశ౯ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు ఎండ్లూరి ప్రభాకర్ పేర్కొన్నారు. శుక్రవారం రెవెన్యూ హోంలో సైకాలజిస్ట్ లహరి ఆధ్వర్యంలో 'ఫ్రీ యువర్ మైండ్ బిహేవర్ నెగిటివ్ థాట్స్' అనే కాన్సెప్ట్‌తో కౌన్సెలింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ హాజరయ్యారు,. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో మానసిక ఒత్తిడిని తట్టుకోలేక ఎంతో మంది ప్రాణాలు తీసుకుంటున్నారన్నారు. ముఖ్యంగా యవత సామాజిక మాధ్యమాలకు, మత్తు పదార్థాలకు బానిసలై మానసిక ఆందోళనకు గురవుతోందన్నారు. మానసిక ఒత్తిడిని జయించే శక్తిని ఏర్పరుచుకుంటేనే ప్రశాంత జీవితం గడపవచ్చన్నారు. ఒత్తిడి, ఆందోళనలకు గురవుతున్న వారు ఇలాంటి కౌన్సెలింగ్ సెంటర్ల సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హేమలత, విశ్రాంత ప్రిన్సిపాల్ రమేష్‌నారాయణ, కత్తి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

మత్తుతో జీవితాలు చిత్తు



డ్రగ్స్ అనర్థాలపై ఏర్పాటు చేసిన హోర్డింగ్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: మత్తు (డ్రగ్స్) జోలికి వెళ్తే జీవితాలు చిత్తవుతాయని డీఎస్పీ జి.ప్రసాదరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆర్ట్స్ కళాశాల వద్ద కళాశాల యాజమాన్య సౌజన్యంతో డ్రగ్స్ అనర్థాలను తెలియజేస్తూ హోర్డింగులు ఏర్పాటు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్‌కు అలవాటుపడి బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని యువతకు సూచించారు. కార్యక్రమంలో త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అదాని ఆస్తులు జప్తు చేయాలి

రాప్తాడు: అదాని అక్రమంగా సంపాదించిన ఆస్తులను వెంటనే జప్తు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులతో కలిసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ... కేంద్రం ప్రవేశపెట్టిన 2023–24 బడ్జెట్ కార్పొరేట్ వర్గాలకే మేలు జరిగేలా ఉందన్నారు. ప్రధాని మోదీ తన బినామీ అదానీకి కల్పించిన ప్రయోజనాలతో రోజూ రూ.1,660 కోట్ల ఆదాయం వస్తోందని, దీంతోనే అదాని దేశంలోని ఓడరేవుల్లో పాగా వేశారన్నారు. ఎయిర్‌పోర్టులతో పాటు సిమెంట్ కర్మాగారాలు కొనుగోలు చేశారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అదాని ఆస్తులను జాయింట్ పార్లమెంటు కమిటీ ద్వారా బయటకు తీసి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజక కార్యదర్శి రామకృష్ణ, రాప్తాడు, రూరల్ మండల కార్యదర్శులు రవీంద్రా, రమేష్, సహాయ కార్యదర్శులు చలపతి, నరేష్ పాల్గొన్నారు.

మసీదుల అభివృద్ధికి సహకారం

- రూ.11 లక్షలు విరాళం ప్రకటించిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు రూరల్: మసీదుల అభివృద్ధికి రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సహకారం అందించారు. అనంతపురం మండలం కళ్యాణదుర్గం రోడ్డు విద్యారణ్యనగర్‌లోని తారా మసీదుకు రూ.6 లక్షలు, ఫాతిమా మసీదుకు రూ.5 లక్షలు చొప్పున ఎమ్మెల్యే శుక్రవారం విరాళం అందజేశారు. ఆయా మసీదుల్లో ముస్లింలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రభుత్వం నుంచి మసీదుల అభివృద్ధికి సాయమందేలా చర్యలు తీసుకుంటానన్నారు. భవిష్యత్తులోనూ తనవంతు సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ముస్లింలు కృతజ్ఞతలు తెలియజేసి ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు మున్నా, షామీర్, ఆరిఫ్, వలి, మహమ్మద్, ముతవల్లితో పాటు ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు బి.గోపాల్‌రెడ్డి, శ్యాంసుందర్, గోపీ, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముస్లిం పెద్దలకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

సాంకేతిక రంగంలో రాణిస్తేనే భవిత



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్: సాంకేతిక రంగంలో రాణిస్తేనే విద్యార్థులకు భవిష్యత్తు ఉంటుందని బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ పల్లె కృష్ణకిశోర్ అన్నారు. పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పాలిటెక్నిక్ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా సైన్స్ ఎగ్జిబిషన్ శుక్రవారం ముగిసింది. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను చూడటానికి వివిధ కళాశాలల విద్యార్థులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ సందర్భంగా బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ పల్లె కృష్ణకిశోర్ మాట్లాడారు. అనంతరం నమూనాలను తయారు చేసిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వైభవ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ అధికారులపై ఫిర్యాదు

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంపై డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (గుంటూరు)కు కమిషనర్ కె.భాగ్యలక్ష్మి శుక్రవారం మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. నగరంలో అనధికార భవనాల నిర్మాణం, అతిక్రమణలు, అదనపు ఫ్లోర్ల ఏర్పాటుపై చర్యలు తీసుకోవడం లేదని, 48 గంటల్లో అక్రమ నిర్మాణాలపై స్పష్టమైన వివరణ ఇవ్వకపోతే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటున్నట్లు జారీ చేసిన మెమో కాపీని ఫిర్యాదుకు జత చేశారు.

అక్రమ నిర్మాణాలు తొలగించండి

ప్రశాంతినగర్‌లో నిర్మిస్తున్న అక్రమ కట్టడాన్ని తక్షణం తొలగించాలని ఏసీపీ శ్రీనివాసులురెడ్డి, తదితర సిబ్బందిని కమిషనర్ భాగ్యలక్ష్మి ఆదేశించారు. 'ఆక్రమణలకు పక్కా ప్రణాళిక' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. అక్రమ నిర్మాణాలను ఉపేక్షించవద్దన్నారు.

పొగాకు నియంత్రణపై అవగాహన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జాతీయ పొగాకు నియంత్రణపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ శుక్రవారం నుంచి అవగాహన కార్యక్రమాలు ప్రారంభించింది. అందులో భాగంగా నగరంలోని బీసీ స్టడీ సర్కిల్ వద్ద ఉద్యోగులు, స్థానికులకు పొగాకు నియంత్రణపై అవగాహన కల్పించింది. ప్రభుత్వ కార్యాలయాల్లో పొగాకు సేవన రహితంగా మార్చాలని, ఇందుకు ఉద్యోగుల సహకారం అవసరమని సోషల్ వర్కర్ శ్రీరాములు కోరారు. అనంతరం పొగాకు నియంత్రణ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్ సిబ్బంది రవీంద్ర, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, జయప్రకాష్ నాయుడు, మనోహర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, P. ANNADEVI (Old Name), after marriage I have changed my name as from (P. ANNADEVI) to Smt M. (MOHAMED) SYED ALI FATHIMA W/o. ABDULKABUR MOHAMED IBRAHIM, R/o 27, Rajahamsa Sweehomes, KIA Car Showroom back side, Anantapur (T&D) A.P. Through as per my Aadhaar card (7273 4122 6016), Henceforth my name known as M. SYED ALI FATHIMA.

విలక్షణం.. 'సురభి' నాటకం

- అనంతపురంలో నేడు 'ఘంటసాల నాటకం'

అనంతపురం కల్చరల్: సాంకేతికంగా అభివృద్ధి చెందని రోజుల్లో గ్రాఫిక్స్‌ను తలదన్నేలా 'సురభి' కళాకారులు రంగస్థలంపై అద్భుతాలు సృష్టించారు. పౌరాణిక నాటకాలు దేశవిదేశాలలో ప్రదర్శితమై తెలుగువారి ఖ్యాతిని చాటాయి. వైఎస్సార్ జిల్లా సురభి గ్రామానికి చెందిన సంచార జాతి కళాకారులు ఓ బృందంగా విడిపోయి హైదరాబాద్ స్టేషన్‌ఘన్‌పూర్ ప్రాంతంలో స్థిరపడ్డారు. ఒకే కుటుంబానికి చెందిన వందలాదిమంది కళాకారులు నాటక ప్రదర్శనలపై ఆధారపడి జీవిస్తున్న రోజుల్లో కరోనా పరిస్థితులు వారిని దారుణంగా దెబ్బతీశాయి. ఇలాంటి తరుణంలో దర్శక, రచయిత సత్య జగదీష్ సురభి సంస్థ అయిన శ్రీ సాయి సంతోషి నాట్య మండలిని దత్తత తీసుకున్నారు. నిధులు సేకరించి.. నాటక ప్రదర్శనలు నిర్వహిస్తూ సురభి కళాకారులకు అండగా నిలిచారు. పౌరాణిక నాటకాలకు పరిమితమైన సురభి కళాకారులు అమరగాయకుడు ఘంటసాల జీవితాన్ని నాటకంగా మలచి తెలుగు రాష్ట్రాలలో ప్రదర్శించి ఔరా అనిపించుకున్నారు. ఈ క్రమంలో రాయలసీమలోనే తొలిసారి 'సురభి' కళాకారులు అనంతపురంలో ఘంటలసాల వర్ధంతి సందర్భంగా శని వారం 'ఘంటసాల నాటకం' ప్రదర్శించనున్నారు.

నేడు వాడవాడలా సంగీత మధురిమలు

- ఘంటసాల వర్ధంతి సందర్భంగా అనంతపురం విచ్చేసిన శ్రీసాయి సంతోషి నాట్య మండలి (స్టేషన్ ఘన్‌పూర్) సురభి కళాకారులు శనివారం సాయంత్రం 6.30 గంటలకు లలితకళాపరిషత్తులో 'ఘంటసాల నాటకం' ప్రదర్శిస్తారు.
- ఉదయం 10 గంటలకు మూడో రోడ్డులోని ఘంటసాల భవన్‌లో సంగీత కచేరీ జరగనుంది. ఇటీవల మరణించిన విజయ్‌కుమార్‌కు, వాణీజయరామ్, కళాతపస్వి కె.విశ్వనాథ్‌కు నివాళిగా గాయనీగాయకులు అలనాటి పాటలతో ఆనంద పరవశులను చేస్తారని నిర్వాహకులు పాలసముద్రం నాగరాజు తెలిపారు.
- సాయంత్రం పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి నేతృత్వంలో ఆఫీసర్స్ క్లబ్ వేదికగా సంగీత విభావరి నిర్వహించనున్నారు. ముఖ్యంగా ఘంటసాల 49వ వర్ధంతి సందర్భంగా అవార్డులను ప్రదానం చేస్తున్నామని, కళాభిమానులు విచ్చేయాలని నిర్వాహకులు సురేష్ తెలిపారు.



ఘంటసాల నాటకంలోని ఓ సన్నివేశం (ఫైల్)

సురభి కళను కాపాడుకుందాం

నేను పోలీసు శాఖలో పనిచేసి రిటైర్డ్ అయ్యాను. హైదరాబాద్‌లోనే ఉంటున్నాం. కళాకారుల పట్ల ఆదరణ భావం ఉన్న పలువురితో కలిసి అంతరించిపోతున్న 'సురభి' నాటకాలను కాపాడుకోవాలని ఘంటసాల నాటకాన్ని రాశాను. ఇప్పటికి ఆరు ప్రదర్శనలయ్యాయి. రాయలసీమలో అనంతపురానికి తొలిసారి వచ్చాం. నాటకంలోని పాత్రలు ఘంటసాల జీవిత విశేషాలను ఆసక్తిగా తెలియజేస్తాయి. ఎటువంటి రుసుం లేకుండా ఉచితంగా ప్రదర్శిస్తున్న నాటకాన్ని ప్రేక్షకులు విరివిగా విచ్చేసి తిలకిస్తే వారిని ప్రోత్సహించినట్టవుతుంది.

– సత్య జగదీష్, నాటక రచయిత, దర్శకుడు